



హెచ్ఎల్సీ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న వామపక్షాలు, కాంగ్రెస్, ప్రజాసంఘాల నాయకులు

లైనింగ్ కాదు..వెడల్పు చేయండి..!

◆ కాంట్రాక్టర్ల కోసం రైతులకు అన్యాయం చేయొద్దు
◆ హంద్రీనీవా కాలువ వెడల్పుతోనే ప్రయోజనం
◆ వామపక్షాలు, కాంగ్రెస్, ప్రజాసంఘాల డిమాండ్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

'జిల్లాకు ప్రాణాధారమైన హంద్రీనీవా కాలువను లైనింగ్ చేయడం వల్ల కాంట్రాక్టర్లకు ఉపయోగం తప్పా రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదు... ప్రభుత్వం స్పందించి కాలువను 10 వేల క్యూసెక్కులకు వెడల్పు చేసి, ఆయకట్టుకు నీరు ఇస్తే రైతులకు ప్రయోజనం చేకూరుతుంది.' అని వామపక్షాలు, కాంగ్రెస్, ప్రజాసంఘాల నాయకులు పునరుద్ఘాటించారు. హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ వామపక్ష, కాంగ్రెస్ పార్టీలు, ఏపీ రైతు సంఘం, జలసాధన సమితి ఆధ్వర్యంలో హంద్రీనీవా ఎస్ఇ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. హెచ్ఎల్సి కాలనీ నుంచి ఎస్ఇ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యాలయం వద్ద సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్ అధ్యక్షతన వహించిన ధర్నాలో ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఓ.నల్లప్ప, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్, జల సాధన సమితి ఎస్ఎం.బాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కరువు గురవుతున్న రాయలసీమ జిల్లాలకు తాగునీరు, సాగునీరు అందించాలనే ఉద్దేశంతో 1988లో కృష్ణా జలాలలను రాయలసీమకు ఇచ్చేలా హంద్రీనీవాను ప్రారంభించారని తెలిపారు. ఈ ప్రాజెక్టు కింద రాయలసీమ జిల్లాల్లో 6.2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యం ఉందన్నారు. అనంతపురం జిల్లాలో 3.40 లక్షల ఎకరాలకు నీరు అందించాల్సి ఉందన్నారు. 40 టిఎంసిల నీటి కేటాయింపులు ఉన్నా ఇప్పటి వరకు ఆ స్థాయిలో నీరు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. సిపిఎం రాష్ట్ర నాయకులు ఓ.నల్లప్ప, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్ మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ వెడల్పు చేయకుండా లైనింగ్ చేయడం సరికాదన్నారు. లైనింగ్ చేయడం వల్ల కాంట్రాక్టర్‌లకు లాభం జరుగుతుంది తప్పా రైతులకు ఎలాంటి లాభం లేదన్నారు. ఒకరకంగా లైనింగ్ పనులు రైతులకు మరణశాసనంగా మారుతాయన్నారు. లైనింగ్ పనులు నిలుపుదల చేసి కాలువను 10 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేసే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అనంతరం హెచ్ఎల్సీ అధికారులకు వినితిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.నారాయణస్వామి, మల్లికార్జున, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.రామిరెడ్డి, సిపిఐఎంఎల్ నాయకులు చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకులు ఇమామ్‌బాషా, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, సిపిఐ శ్రీ సత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చితికిన చిన్ననీటి పారుదల..!



◆ ఈ ఏడాది మొత్తంగా ఒక్క పనీలేదు
◆ పనుల పురోగతి 'ఎక్కడవేసిన గొంగళి అక్కడే'



జిల్లాలో చిన్ననీటి పారుదల శాఖలో పనులు ఎక్కడివక్కడే అన్న చందంగా మారాయి. జపాన్ బ్యాంకు సహకారంతో చేపట్టన పనులతోపాటు విపత్తు నిధుల కింద మంజూరైన పనులు కూడా ఏడాదిగా ఒక్క అడుగూ ముందుకు పడలేదు. రూ.134.18 కోట్ల పనులు చేపడితే ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. 60 పనులు చెరువుల మరమ్మతులు, అభివృద్ధి కోసం చేపట్టిన ఈ పనులు కొన్ని మధ్యలోనే ఆగిపోగా, మరికొన్ని ప్రతిపాదనల దశలో ఉండిపోయాయి.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జపాన్ బ్యాంకు నిధులతో ఎపిఐఎల్ఐపి కింద ఐదు పనులు చేపట్టారు. వీటి విలువ రూ.5.93 కోట్లు ఉంది. ఐదు పనుల్లో నాలుగు పనులను కాంట్రాక్టర్లు ఆపేశారు. ఒక్క పని పురోగతిలో ఉందని చెబుతున్నా, ఆశించిన పురోగతి లేదు. అదే నిధుల కిందే మరో పనిని చేపట్టారు. రూ.9.25 కోట్ల విలువైన పనులను కాంట్రాక్టరు బిల్లులు రాక ఆపేశారు. నాబార్డు నిధులతో చేపట్టిన రూ.9.30 లక్షల పనుల పరిస్థితి ఇదే రకంగా ఉంది. పని పూర్తవకనే ముగించేందుకు కాంట్రాక్టర్ సిద్ధమయ్యారు. సాధారణ రాష్ట్ర బడ్జెట్ కింద ఆరు పనులను రూ.61.88 కోట్లతో చేపట్టిన వాటిల్లో ఒక పని కాంట్రాక్టరు నిలిపివేసి ఉండగా, రెండు పనులు ప్రారంభమవ్వాల్సి ఉంది. తక్కిన పనులు సాంకేతిక సమస్యలతో ఆగాయి. స్టేట్ డెవలెప్‌మెంట్ స్కీమ్ కింద రూ.4.66 కోట్లతో చేపట్టిన పనులను కాంట్రాక్టర్ ఆపేశాడు. విపత్తుల నిధి కింద రూ.48.50 లక్షలతో చేపట్టిన నాలుగు పనులు ఎంఒయు దశలో ఉన్నాయి. అదే నిధులతో మధ్యతరహా ప్రాజెక్టు పనులు పది చేపట్టారు. రూ.3.81 కోట్ల పనులు టెండరు దశలో ఉన్నాయి. ప్రపంచ బ్యాంకు నిధులతో 32 పనులు రూ.48.02 కోట్లతో చేపట్టారు. ఇందులో తొమ్మిది పనులు కాంట్రాక్టర్లు నిలిపేశారు. 11 పనులు ప్రారంభం కావాల్సి ఉంది. తక్కినవి మధ్యలో నడుస్తున్నాయి. ఇలా మొత్తంగా చూసినప్పుడు 2024-25 ఆర్థిక సంవత్సరంలో చిన్ననీటి పారుదల శాఖ పరిధిలో ఒక్క పనీ పూర్తవలేదు. ఒక్క రూపాయి నిధులు కూడా ఖర్చుపెట్టిన దాఖలాల్లేవు.

కీలకమైన ఈ శాఖ పనితీరు ఇలా ?

వర్షాభావ ప్రాంతమైన అనంతపురం జిల్లాలో చిన్న నీటి పారుదల శాఖ ఎంతో కీలకమైంది. ఎప్పుడో ఒకసారి పడే వర్షాన్ని ఒడిపట్టుకుని నిలువ ఉంచుకోవడం ద్వారా రెండు, మూడు సంవత్సరాలు కరువును ఎదుర్కొనేందుకు వీలుంటుంది. చెరువుల్లోకి వర్షం నీరు చేరితే గండ్లు పడిపోయే పరిస్థితులు నెలకొని ఉన్నాయి. వీటి మరమ్మతులు, నిర్వహణను ప్రభుత్వాలు పూర్తిగా ఎత్తిపెట్లేశాయన్న విమర్శలున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు అనేక చెరువులకు గండ్లు పడి నీరు వృథాగాపోయిన విషయం తెలిసిందే. చిన్ననీటి పారుదల వ్యవస్థను మెరుగుపరచడంపై దృష్టి సారించాలని పలువురు మేధావులు సూచిస్తున్నారు.



డిసిహెచ్ఎస్ పంపిన లేఖను ఆసుపత్రి గోడకు అతికిస్తున్న సిపిఎం నాయకులు

ఆసుపత్రి సెక్యూరిటీ గార్డును విధుల్లోకి తీసుకోవాలి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రభుత్వ వైద్యశాలలో పని చేసే సెక్యూరిటీ గార్డు రవిని తక్షణమే విధుల్లోకి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. రవిని విధుల్లోకి తీసుకోవాలని జిల్లా డిసిహెచ్ఎస్ అధికారి పంపిన లేఖను సూపరింటెండెంట్ మెర్సీ జ్ఞానసుధాకు ఇచ్చేందుకు వెళ్తే కనీసం లేఖను తాకకుండా ఆమె వ్యవహరించిన తీరును భారాకరమన్నారు. డిసిహెచ్ఎస్ పంపిన లేఖను సూపరింటెండెంట్ తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ మంగళవారం డిసిహెచ్ఎస్ పంపిన లేఖను ఆసుపత్రి గోడకు అతికించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పైస్థాయి అధికారులు పంపిన లేఖను ముట్టనని ఇలాంటి అధికారులు అవసరమా..? అని ప్రశ్నించారు. డిసిహెచ్ఎస్ స్పష్టంగా రవి అను కార్మికుని తక్షణమే పనిలోకి తీసుకోవాలని లేఖ పంపారన్నారు. ఇప్పటికైనా సూపరింటెండెంట్ స్పందించి తక్షణమే డిసిహెచ్ఎస్ ఆదేశాల మేరకు తొలగించిన రవిని విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

మహిళలపై అరాచకాలను అరికట్టడంలో విఫలం

గుత్తి : దేశంలో బాలికలు, మహిళలు, వృద్ధులపై రోజురోజుకూ పెరుగుతున్న దౌర్జన్యాలు, అరాచకాలు, లైంగికదాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని బీఎస్పీ జిల్లా అధ్యక్షులు గద్దల నాగభూషణం, నియోజకవర్గ అధ్యక్షుడు విజయ్, సిపిఎం నాయకులు బి.రామకృష్ణ విమర్శించారు. గుంటూరు జిల్లా పెద్దనందిపాడులో వృద్ధురాలిపై జరిగిన లైంగిక దాడిని నిరసిస్తూ గుత్తిలో బీఎస్పీ, సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహం నుంచి నాయకులు, కార్యకర్తలు ప్రదర్శనగా గాంధీ కూడలికి చేరుకుని మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి.శ్రీనివాసరాజు, నాయకులు బి.వెంకటకొండయ్య, టి.ఓబులేసు, బండల రామాంజనేయులు, సుధాకర్, సిపిఎం నాయకులు మద్దిలేటి, కవిత, వెంకటలక్ష్మి, రేవతి, సిపిఐ నాయకులు షేక్ నజీర్, మహమ్మదా, మాబున్నీ, తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి ఉచిత శిక్షణ

గుంతకల్లు : కానిస్టేబుల్ మెయిన్స్, ఆర్ఆర్‌బి, గ్రూప్-డి ఉద్యోగాలకు పరీక్షలు రాయాలనుకునే నిరుద్యోగ యువత ఈనెల 8 తేదీ నుంచి ఏర్పాటు చేయనున్న ఉచిత కోచింగ్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు బి.సురేష్‌బాబు సూచించారు. మంగళవారం స్థానిక హంపిరెడ్డి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలో మొట్ట మొదటిసారిగా భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 8వతేదీ నుంచి స్థానిక శ్రీసాయి డిగ్రీ ఉమెన్స్ కళాశాలలో పోలీస్ కానిస్టేబుల్స్ మెయిన్స్‌కు అర్హత సాధించిన, ఆర్ఆర్‌బి, గ్రూప్-డి వంటి ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచిత కోచింగ్ సెంటర్ చాలా ఉపయోగపడతుందన్నారు. పట్టణంతోపాటు, చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్.. 88977 29429ను సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ నాయకులు రమేష్, షబ్బీర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు బి.సురేంద్రబాబు

సంతమార్కెట్ వేలంపాట వాయిదా

◆ సమస్యలపై కార్పొరేషన్ అధికారులను ప్రశ్నించిన కాంట్రాక్టర్లు
◆ తన పరిధి కాదన్న డిప్యూటీ కమిషనర్ ◆ వేలం వాయిదా వేస్తూ నిర్ణయం

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో దినసరి సంత మార్కెట్ టెండర్ వేలంపాట అధికారుల వింత ధోరణితో ప్రహసనంగా మారింది. వేలంపాట ప్రారంభం సమయంలో గడచిన మూడేళ్లుగా దినసరి సంత మార్కెట్ టెండర్‌ను దక్కించుకున్న విజయ్‌కుమార్ సుంకం వసూళ్లలో ఎదురయ్యే సమస్యలను డిప్యూటీ కమిషనర్ మిటికేరి వెంకటేశులు దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారంపై స్పష్టమైన ప్రకటన ఇవ్వాలని ఆయన కోరారు. సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని చెప్పాల్సిన డిప్యూటీ కమిషనర్ అది తనకు తెలియదని, కమిషనర్‌కు చెప్పాలంటూ సమాధానం ఇచ్చారు. ఇదే సమయంలో వేలంపాటను నిలిపేసి టెండర్‌ను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

పోటాపోటీగా మటన్‌మార్కెట్ వేలం

మటన్ మార్కెట్ వేలంపాటను సర్కారు సవాల్ రూ.5.10లక్షలతో ప్రారంభించారు. కాంట్రాక్టర్లు హలీం సిద్దయ్య, చంద్రశేఖర్, సుబ్బయ్యలు పోటాపోటీగా వేలంలో ధరను పెంచారు. 6.80లక్షలతో మటన్ మార్కెట్‌ను కాంట్రాక్టర్ హలీం దక్కించుకున్నాడు. టెండర్ దక్కించుకున్న తర్వాత కాంట్రాక్టర్ హలీం డిప్యూటీ కమిషనర్‌తో సుంకం వసూలుపై మాట్లాడారు. సుంకం వసూలు సమయంలో తనకు బెదిరింపులు వస్తే వారి నుంచి అధికారులు రక్షణ కల్పించాలని కోరారు. దీనిపై డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ టెండర్‌లో పాల్గొని సుంకం వసూలు దక్కించుకున్న తర్వాత ధైర్యంగా ప్రత్యర్థులను ఎదుర్కోవాలంటూ సలహా ఇచ్చారు.

వేలం పాటలో దరఖాస్తు చేసుకోని వారు..!

దినసరి సంత మార్కెట్ వేలంపాట ప్రారంభానికి ముందు అర్బన్ ఎమ్మెల్యే అనుచర వర్గం, మరో ఇద్దరు కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొనేందుకు వచ్చారు. టెండర్‌లో వేలంపాట పాడేందుకు దరఖాస్తు చేసిన



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

వారే ఉండాలని, ఇతరులు బయటికి వెళ్లాలని గుమాస్తా నారాయణస్వామి మైక్‌లో చెప్పారు. కాంట్రాక్టర్లు ఆ మాటలను బేఖాతర్ చేస్తూ అక్కడే కూర్చొన్నారు. ఈ విషయాన్ని గట్టిగా చెప్పాలని డిప్యూటీ కమిషనర్ వెంకటేశులు రెవెన్యూ ఆఫీసర్లు విజయ్ కుమార్, వెంకటేశులును ఆదేశించారు. అక్కడున్న పరిస్థితుల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు ఎటూ చెప్పకుండా మౌనం దాల్చారు. ఎమ్మెల్యే అనుచర వర్గం ఐదుగురు వేలం పాట నిర్వహించే గదిలోనూ కూర్చొన్నారు.


11న దినసరి సంత మార్కెట్ వేలంపాట

2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మంగళవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం రెవెన్యూ విభాగంలో నిర్వహించిన దినసరి సంత మార్కెట్ వేలం పాట వాయిదా పడింది. దీనిని ఈనెల 11వ తేదీన తిరిగి నిర్వహిస్తున్నట్లు కమిషనర్ మల్లికార్జున రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు దినసరి సంత మార్కెట్ వేలంపాటలో పాల్గొన్న ముగ్గురు కాంట్రాక్టర్లు సమస్యలు పరిష్కరించే వరకు టెండర్‌లో పాల్గొనమనితేల్చి చెప్పటంతో వేలంపాటను వాయిదా వేస్తున్నట్లు డిప్యూటీ కమిషనర్ మెటికేరి వెంకటేశులు తెలిపారు.

ప్రాక్టికల్స్ పేరుతో అధిక ఫీజుల వసూళ్లు

కళాశాలలపై చర్యలు తీసుకోవాలి -ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రాక్టికల్స్ పేరుతో అధిక వసూళ్లకు పాల్పడుతున్న జిల్లాలోని ప్రయివేట్, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్ఐఓ వెంకటరమణ నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరువుకు నిలయమైన అనంతపురం జిల్లాలో విద్యామాఫియా అనేక రూపాల్లో విజృంభిస్తోందన్నారు. గత కొంతకాలంగా ప్రయివేట్ కార్పొరేట్ విద్యా సంస్థల్లో విద్యార్థులపై జరుగుతున్న ఫీజులు వేధింపులే నిదర్శనమన్నారు. విద్యార్థులను ఫీజుల కోసం మానసికంగా నైతికంగా ఒత్తిడి గురి చేస్తున్నారని తెలిపారు. పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో విద్యార్థులపై అనేక రూపాల్లో డబ్బులు వసూలు చేసే ప్రయత్నాలు కార్పొరేట్, ప్రయివేట్ విద్యా సంస్థలు చేస్తున్నాయని తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షల సందర్భంగా విద్యార్థులకు మీకు మంచి మార్కులు వేయిస్తాం ఇతర కళాశాల నుంచి ప్రాక్టికల్స్ ఇన్విజిలేటర్లుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల పని చేసే లెక్చరర్స్ వస్తున్నారు వారికే డబ్బులు ఇస్తేనే మీకు మార్కులు వేస్తారు మీకు పూర్తిగా పాస్ అయ్యే విధంగా మార్కులు వేయిస్తాం అని విద్యార్థులకు మాయమాటలు చెబుతూ ఒక్కొక్క విద్యార్థి నుంచి రూ.1500 నుంచి రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నారని తెలిపారు. కావున పరిశీలించి డబ్బులు వసూలు చేస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్దు, జిల్లా గర్ల్స్ కన్వీనర్ రజిత, ఉపాధ్యక్షుడు గిరిబాబు, పట్టణ నాయకులు విజయ్, సాయి, అజయ్, లోకేష్, ధనంజయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'అనంత ఉద్యానవన సమ్మేళనం'

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంత వేదికగా జాతీయ స్థాయి "అనంత హార్టికల్చర్ కాంక్లేవ్" కార్యక్రమం బుధవారం జరగనుంది. అనంతపురం నగరంలోని బళ్లారి రోడ్ ఎంవైఆర్ కన్వెన్షనల్ ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఈ కార్యక్రమం జరగనుంది. కార్యక్రమం ఏర్పాట్లు, నిర్వహణపై కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అన్ని శాఖల అధికారులు వారికి కేటాయించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్లను, ఐడి కార్డులను సిద్ధం చేయాలని డిపిఒకు సూచించారు. ఈ కార్యక్రమానికి ఎవరెవరు వస్తున్నారు అనేది ముందుగానే చూసుకొని వారికి ఒక అధికారిని అటాచ్ చేయాలని, అతిథులకు వసతి సౌకర్యాలు కల్పించాలన్నారు. అవసరమైన ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని, రిజిస్ట్రేషన్ డెస్క్ ఏర్పాటు చేయాలని, కార్పొరేట్ స్థాయిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, ఆర్డీవో కేశవనాయుడు, అడిషినల్ ఎస్పీ రమణమూర్తి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, హార్టికల్చర్ డిడి నరసింహారావు, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఉమామహేశ్వరమ్మ, ఎపిఎంఐపి పీడీ రఘునాథరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ మల్లికార్జున, జెడ్పీ సిఇఒ ఆర్.రామచంద్ర రెడ్డి, సిపిఒ అశోక్ కుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కల్తీ పాల గుట్టురట్టు..!

బండమీదపల్లిలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి-అనంతపురం



కల్తీపాలపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించారు. రాప్తాడు మండలంలో వివిధ పదార్థాలతో పాలను కల్తీ చేస్తున్న ఓ వ్యక్తిని గుర్తించి అతనిపై కేసు నమోదు చేశారు. అనంతపురం రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ వైబిపిటిఎ.ప్రసాద్ ఆదేశాల మేరకు డీఎస్పీ నాగభూషణం, సిఐ సద్గురుడు, ఏవో వాసుప్రకాష్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ తస్లీం, రెవెన్యూ అధికారులతో కలసి రాప్తాడు మండలం ఎం.బండమీదపల్లి గ్రామంలో మంగళవారం ఉదయం ఎర్రగుంట రామిరెడ్డి ఇంట్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. తనిఖీ సమయంలో పాలు చిక్కగా కనిపించేందుకు పలు పదార్థాలు వాడుతున్నట్లు గుర్తించారు. పాలు చిక్కగా మారేందుకు పామ్‌ఆయిల్, ఉప్పు, మాల్టోడెక్ట్రిన్ పౌడర్, నీటిని కలిపి చిక్కని ద్రవం తయారు చేస్తున్నట్లు గుర్తించారు. ఈ పాలు తాగడం వల్ల గ్యాస్ట్రిక్, క్యాన్సర్ రోగాలు వచ్చే ప్రమాదం ఉందని అధికారులు తెలిపారు. కల్తీపాల నమూనాలను ఫుడ్ సేఫ్టీ అధికారులు సేకరించి పరిశీలన నిమిత్తం హైదరాబాద్ ల్యాబ్‌కు పంపారు. పాల కల్తీకి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు విజిలెన్స్ డీఎస్పీ తెలిపారు. ఎక్కడైనా పాలు కల్తీ చేస్తున్నట్లు తెలిస్తే విజిలెన్స్ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

బీమారంగంలో ఎఫ్‌డిఐ పెంపు నిర్ణయాన్ని

ఉపసంహరించుకోవాలి

ఎల్ఐసి ఉద్యోగుల సంఘం నాయకులు

ప్రజాశక్తి-రాయదుర్గం



నిరసన తెలుపుతున్న ఎల్ఐసి ఉద్యోగులు

బీమా రంగంలో ఎఫ్‌డిఐ పెంపు నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం రాయదుర్గం కార్యదర్శి బి.క్రిష్టిభూషణ్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్త పిలుపుమేరకు సంఘం అధ్యక్షుడు శేషగిరి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బ్రాంచి కార్యాలయం ఎదుట ఎల్ఐసి ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని 74 శాతం నుంచి 100 శాతానికి పెంచడం తగదన్నారు. విదేశీ బీమా కంపెనీలను నేరుగా ఆహ్వానించడం బీమారంగంతోపాటు పాలసీదారులకు చాలా నష్టదాయకమన్నారు. ముఖ్యంగా దేశ భద్రత, ప్రజల సమాచార గోప్యతకు ముప్పు వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ నిర్ణయాన్ని కేంద్రం ఉపసంహచరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే పాలసీ ప్రీమియంలపై జీఎస్టీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి ఉద్యోగులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి

బీసీ వెల్ఫేర్ డీడీ ఖుష్బూకొరారి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

పదో తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని బిసి వెల్ఫేర్ డీడీ ఖుష్బూకొరారి సూచించారు. మంగళవారం నగరంలోని కెఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో అనంతపురం డివిజన్ పరిధిలోని బిసి హాస్టళ్లలో ఉన్న పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ-శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బీసీ హాస్టళ్లలో 647 మంది 10వ తరగతి విద్యార్థులు ఉన్నార్నఅన్నరు. ఆయా విద్యార్థుల్తో పరీక్షలపై ఉన్న భయం పోగొట్టడంతోపాటు ప్రేరణ కలిగించం, సబ్జెక్టులపై శిక్షణ ఇచ్చేందుకు ప్రేరణ-శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. కావున విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా చదివితే వందశాతం ఉత్తీర్ణత సాధించవచ్చన్నారు. అనంతరం క్రియేటర్ క్రిష్ణ విద్యార్థుల్లో ప్రేరణ కలిగించారు. అలాగే గణితం, సైన్స్, ఇంగ్లీష్ టీచర్లు సత్యప్రసాద్, శివప్రసాద్, నాగేంద్ర, చంద్రశేఖర్, అబ్దుల్ మునాఫ్, సురేంద్రబాబు ఆయా సబ్జెక్టులపై శిక్షణ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎబిసిడబ్ల్యుఒ సుభాషిణి, బీసీ హాస్టళ్ల వార్డెన్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మస్తాన్, జిల్లా అధ్యక్షులు మారుతప్రసాద్, ఠాగూర్, నాగరాజు, శ్రీనివాసులు, షహింతాజ్, అరుణ, సుబ్రమణ్యం, నారాయణ నాయక్, శాంతమ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

అనారోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని విప్, స్థానిక ప్రాంతీయ ఆసుపత్రి అభివృద్ధి సలహా మండలి అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం రాయదుర్గంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటైన అభివృద్ధి సలహా మండలి కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తాను శాసనసభ్యులుగా ఉన్నప్పుడు 30పడకల ఆసుపత్రిగా ఉన్న ప్రభుత్వాసుపత్రిని 100 పడకల స్థాయికి పెంచడంతోపాటు నాబార్డు నిధులతో ఆసుపత్రిలో నూతన భవనాల నిర్మాణాలు చేపట్టామన్నారు. ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులను భర్తీ చేయడంతో పాటు ఆసుపత్రి భవన నిర్మాణాలు సకాలంలో పూర్తి అయ్యేందుకు కృషి చేస్తామన్నారు. నూతనంగా ఏర్పాటు అయిన సలహా మండలి సభ్యులు వైద్యులు, సిబ్బందితో సమన్వయంగా వ్యవహరించి ఆసుపత్రికి వచ్చే రోగులు, ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మెర్సీ జ్ఞాన సుధ, పరిపాలన అధికారి మహబూబ్‌బాషా, సభ్యులు జయంతి సురేష్, పొగనూరు కళ్యాణ చక్రవర్తి, కొండాపురం శ్రీనివాసులు, చంద్రగిరి సంపత్ కుమారీ, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, పరిపాలన అధికారి మహబూబ్ బాషా, వైద్యులు మాధవి, మహేష్, టిడిపి పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, నాయకులు పురుషోత్తం, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విప్ కాలవ శ్రీనివాసులు

మహిళా ఉద్యోగులపై డిఇ పరుష వ్యాఖ్యలు

సచివాలయ ఉద్యోగుల ఆవేదన

ప్రజాశక్తి-గుత్తి

తమ పట్ల మున్సిపల్ డిఇ హేమచంద్ర అసభ్యకరంగా వ్యాఖ్యానిస్తున్నారని వార్డు సచివాలయ మహిళా ఉద్యోగులు వాపోయారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సోమవారం మున్సిపాలిటీలోని ఇంజినీరింగ్ సెక్షన్ లో డిఇ హేమచంద్ర వార్డు సచివాలయాల ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేసి మహిళా ఉద్యోగులైన తమపై అసభ్యకరంగా దూషించారని ఆవేదన వ్యక్తం చేశారు. గత సమావేశాల్లో కూడా ఇలాగే ప్రవర్తించేవారని చెప్పారు. గుంతకల్లు మున్సిపాలిటీలో హేమచంద్ర పనిచేసే సమయంలో మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని.. అప్పట్లో ఉన్నతాధికారులకు మహిళా ఉద్యోగులు ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. ఈ విషయంపై డిఇ హేమచంద్రను ప్రజాశక్తి ఫోన్‌లో సంప్రదించగా సచివాలయ ఉద్యోగులు సక్రమంగా విధులు రాకపోవడంతో దూషించిన మాట వాస్తవమేనని ఒప్పుకున్నారు. గుంతకల్లులో మహిళా ఉద్యోగులు మీపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారని అడగ్గా.. 'అవును.. అనంతపురంలోనూ.. కళ్యాణదుర్గంలో కూడా నాపై ఫిర్యాదు చేశారు' అని వెటకారంగా చెప్పడం గమనార్హం.

ప్రెస్‌క్లబ్‌లో నీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-అనంతపురం

కొన్నేళ్లుగా అనంతపురంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పడిన నీటి సమస్య రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సహకారంతో పరిష్కారమైంది. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో గత కొన్నేళ్లుగా నీటి సమస్యలతో జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. చేసేది లేక ట్యాంకర్లతో నీటిని తెప్పించుకోవాల్సి వచ్చేది. ఈ తరుణంలో ప్రెస్‌క్లబ్ వ్యవహారాలను చూస్తున్న సీనియర్ జర్నలిస్టు నందినేని దేవప్రసాద్ మృతిచెందిన విషయం తెలిసిందే. ప్రసాద్‌కు నివాళులర్పించేందుకు వచ్చిన ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె తనయుడు పరిటాల శ్రీరామ్‌కు సమస్యలను పలువురు జర్నలిస్టులు విన్నవించారు. అప్పట్లో ఎంత ఖర్చు అయినా తానే బోరు రిపేరి చేయిస్తానని హామీ ఇచ్చారు. హామీ మేరకు మంగళవారం బోరుకు మరమ్మతులు చేయించి నీటి సమస్యను పరిష్కరించారు. దీంతో జర్నలిస్టులు ఎమ్మెల్యేతోపాటు పరిటాల శ్రీరామ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


మరమ్మతుల తర్వాత మోటారుకు వస్తున్న నీరు

పోలీసు వ్యవస్థపై విమర్శలు తగదు : టిడిపి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

పోలీసు వ్యవస్థపై బురదజల్లడం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి తగదని మండల టిడిపి నాయకులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పోలీసులు చట్ట ప్రకారమే పని చేస్తున్నారన్నారు. వైసిపి హయాంలో మాదిరి ఏకపక్షంగా చేయడం లేదన్నారు. మీరు అధికారంలో ఉన్నప్పుడు మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్‌రెడ్డి, ఆయన కుమారుడు జెసి అస్మిత్‌రెడ్డిపై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయించిన విషయాన్ని మరచిపోయారా..? అని ప్రశించారు. అంతేగాకుండా ఎన్నికల ముందే తాను ఓడినా.. గెలిచినా ఫ్యాక్షన్ మొదలు పెడుతానని మీరే బహిరంగంగా చెప్పలేదా.. అని గుర్తుచేశారు. రాజకీయాలను రాజకీయంగానే ఎదుర్కొవాలే తప్ప పోలీసులపై నిందలు మోపడం సరికాదన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు గంగరాజు, దివాకరరెడ్డి, ఆవులాంపల్లి కేశవరెడ్డి, హరినాథరెడ్డి, నాగేశ్వరరెడ్డి, చిరంజీవులు, ఈశ్వరెడ్డి, రాము, తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ఘనంగా రథసప్తమి వేడుకలు

బూదగవి, అమిద్యాలకు పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి-ఉరవకొండ

మండలంలోని బూదగవి, ఆమిద్యాల గ్రామాల్లో వెలసిన సూర్యనారాయణ స్వామి ఆలయాల్లో రథసప్తమి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వేలాదిమంది భక్తులు తెల్లవారుజాము నుంచే బారులుదీరారు. రథసప్తమిని పురస్కరించుకుని బూదగవిలో ఆలయ అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు విశేష పూజలు చేశారు. నవగ్రహ పూజా, అరుణహోమం, తదితర పూజల అనంతరం ఉష, ఛాయాదేవితో సూర్యభగవానుడి కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సూర్యభగవానుడిని దర్శించుకునేందుకు అనంతపురం జిల్లావాసులే కాకుండా కర్ణాటక వాసులు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. దీంతో భక్తులతో ఆలయ ప్రాంగణాలు కిక్కిరిసిపోయాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ చిరంజీవి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


బూదగవిలో స్వామివారి దర్శనానికి వెళ్తున్న భక్తులు

సమస్యలు పరిష్కరించాలని సిఎంకు వినతి

అనంతపురం : బిసి ఉద్యోగులతోపాటు చేనేత వస్త్ర వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని బీసీ ఉద్యోగుల సంఘం, వస్త్ర వ్యాపార సంఘం నాయకులు కోరారు. ఈమేరకు మంగళవారం విజయవాడలో సిఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ ఉద్యోగులు, చేనేత వస్త్ర వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన చంద్రబాబు త్వరలోనే సమస్యల పరిష్కారానికి కమిటీని నియమించి విధి విధానాలను రూపొందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా నాగరాజు, ధర్మవరం వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షులు గిరిరాజు రవి, నీలూరి శీనా, శశి, హేమంత్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేకు ముందు రైతులకు సమాచారం ఇవ్వాలి : ఆర్‌డిఒ


సర్వేను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ వసంత్‌బాబు

కళ్యాణదుర్గంరూరల్ : రెవెన్యూ అధికారులు రీసర్వేకు వెళ్లే ముందు తప్పనిసరిగా సంబంధిత రైతులకు సమాచారం ఇవ్వాలని ఆర్‌డిఒ వసంత్‌బాబు సూచించారు. మంగళవారం కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ పరిధిలోని శెట్టూరు మండలం లక్ష్మంపల్లి గ్రామంలో చేపట్టిన రీ-సర్వేను పరిశీలించారు. ఇందులో భాగంగా సిబ్బందిని వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వేకు వెళ్లే ముందు సంబంధిత రైతులకు తప్పకుండా కనీసం మూడుసార్లు అవకాశం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం డివిజనల్ సర్వేయర్ సుబ్రమణ్యం, సర్వేయర్లు పాల్గొన్నారు.

స్క్రీనింగ్‌తో క్యాన్సర్ నివారణ

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవంలో డిఎంహెచ్ఒ ఇబి.దేవి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రస్తుత ప్రజలను పీడిస్తున్న క్యాన్సర్ వ్యాధి నివారణ కేవలం స్క్రీనింగ్‌తోనే సాధ్యమవుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి ఇబి.దేవి సూచించారు. ప్రపంచ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అనంతపురం ర్యాలీ నిర్వహించారు. స్థానిక డిఎంహెచ్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ తెలుగుతల్లి విగ్రహం వరకూ సాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ మార్గాల ద్వారా క్యాన్సర్ వ్యాపిస్తుందన్నారు. ప్రధానంగా రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వారం, నోటి క్యాన్సర్లు అధికంగా వ్యాపిస్తాయన్నారు. వీటిని ప్రాథమిక దశలో గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే నయమవుతాయన్నారు. ఇందుకోసమే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్క్రీనింగ్ పరీక్షలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసంక్రమిత వ్యాధుల నోడల్ ఆఫీసర్ డాక్టర్ జి.నారాయణస్వామి, డిఐఒ డాక్టర్ యుగంధర్, ఫ్లోరోసిస్ ఆంజనేయులు, జిల్లా పొగాకు నియంత్రణ సామాజిక కార్యకర్త బి.శ్రీరాములు, ప్రేమ్, కిషోర్, మౌనిక, శశికళ, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : రేడియోథెరపీ విభాగం, సామాజిక వైద్యశాస్త్ర విభాగం, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఎన్ఎస్ఎస్ సంయుక్త సారథ్యంలో మంగళవారం క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మాణిక్యరావు క్యాన్సర్ పరీక్షలు, వైద్య సలహాలు, సూచనలపై అవగాహన కల్పించారు. సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ తెలుగు మధుసూదన్, రేడియోథెరపీ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ సతీష్, రేడియేషన్ అంకాలజిస్టులు డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ దినకర్, డాక్టర్ నిహారిక, డాక్టర్ సుమన గోపీచంద్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ శ్రీనివాసరావు, పామన్న, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, ఫిజికల్ డైరెక్టర్ నరసింహనాయక్, తదితరులు పాల్గొన్నారు.


అనంతపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, వైద్యసిబ్బంది

గుత్తి : ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు మంగళవారం గుత్తిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని గుత్తి-అనంతపురం రోడ్డు నుంచి ప్రారంభమైన ర్యాలీ గాంధీచౌక్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ వరకూ ర్యాలీ కొనసాగింది. గాంధీ కూడలి, ఎన్టీఆర్ సర్కిళ్లలో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గెట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎండి రఘునాథ్ రెడ్డి, ప్రభుత్వాసుపత్రి వైద్యులు డాక్టర్ రాజేష్, డాక్టర్ పరమేశ్వర్ మాట్లాడుతూ క్యాన్సర్ ప్రాణాంతకమైందన్నారు. అయితే ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే వ్యాధిని నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, ఎఒ ఇంతియాజ్ బాషా, ఫిజికల్ డైరెక్టర్ జోయల్, గేట్స్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల పరిధిలోని శిద్దరచెర్ల గ్రామంలో సర్పంచి సాకే రామాంజనేయులు ఆధ్వర్యంలో మంగళవారం క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి అమృతాంజలి. సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు శివయ్య, యామిని, అంగన్వాడీ టీచర్ సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా రాయదుర్గం మండల సమావేశం

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం మండల పరిషత్ సమావేశ మీటింగ్ హాల్లో ఎంపిపి విద్యావతి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ముందుగా కోరం లేకుండానే సమావేశం ఎలా నిర్వహిస్తారని పల్లేపల్లి, వడ్రవన్నూరు సర్పంచులు రాజు, అరుణ్ కలిసి ఎంపిడిఒ కొండన్నను ప్రశ్నించారు. అధికారుల వైఖరిని నిరసిస్తూ నేలపై బైఠాయించారు. కనీస సభ్యులు సమావేశానికి హాజరైన తర్వాతనే నిబంధనలు మేరకు సమావేశాన్ని ఆలస్యంగా మొదలు పెట్టినట్లు ఎంపిడిఒ వివరణ ఇచ్చారు. అనంతరం పలు సమస్యలపై సభ్యులు అధికారులను నిల దీశారు. ఇందుకు అధికారులు స్పందిస్తూ త్వరలోనే సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తమ శాఖ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.


సమస్యలపై నిలదీస్తున్న సభ్యులు

'చెత్త సంపద' కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలి

ప్రజాశక్తి-నార్పల

మండలంలోని అన్నిగ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ఎంపిడిఒ గంగావతి, ఇఒఆర్‌డి శైలజారాణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్ జనార్ధన్ సూచించారు మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్నిపంచాయతీల్లో క్లాప్ మిత్రులను నియమించుకుని తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. ఈ సమావేశంలో సర్పంచులు రామాంజనేయులు, కుళ్లాయిరెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, నాగార్జున, కుళ్లాయప్ప, రమణకుమారి, రామాంజినమ్మ, శివలక్ష్మి, స్వప్న, నాగన్న, కార్యదర్శులు శ్యామల, శ్రీనివాసులు, వెంకటరమణ, గోపాల్‌రెడ్డి, హర్షవర్ధన్, కుళ్లాయప్ప, చినరాయుడు, లక్ష్మీదేవి, వరలక్ష్మి, కీర్తి, రాజేశ్వరి, మాధవి, ఇంజినీరింగ్ అసిస్టెట్లు రాంకీ, రంజిత్, చంద్రబాబు, రామేశ్వరి, సునీల్, శ్రీనాథ్, వినయ్, జగదీష్, ప్రత్యూష, జయసింహ, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : చెత్త నుంచి సంపదను తయారు చేసేలా పంచాయతీ అధికారులు, నాయకులు చర్యలు తీసుకోవాలని గుంతకల్లు డివిజనల్ పంచాయతీ అభివృద్ధి అధికారిణి విజయలక్ష్మి సూచించారు. మంగళవారం పెద్దవడుగూరులోని ఎంపిడిఒ కార్యాలయంలో యాడికి, పెద్దవడుగూరు మండలాల పంచాయతీ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి చర్చించారు. ప్రస్తుతం గ్రామాల్లో జరుగుతున్న సర్వే కార్యక్రమాలైన ఇంటి జియోట్యాగింగ్, టాక్స్ సర్వే, రేషన్‌కార్డులపై ఆరాతీశారు. వీటిని తప్పక పూర్తిచేయాలని తెలిపారు. అనంతరం పెద్దవడుగూరులోని చెత్తనిల్వ కేంద్రాన్ని పరిశీలించి సంపదను తయారు చేసి పంచాయతీల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహారెడ్డి, యాడికి ఇఒ శశికళ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


పెద్దవడుగూరులో మాట్లాడుతున్న అధికారులు

'పొలం పిలుస్తోంది'


పుట్లూరు : మండల పరిధిలోని చెర్లోపల్లి, చాలవేముల గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులోఉ భాగంగా రైతు వెంకటరామిరెడ్డి పొలంలో సాగు చేసిన పప్పుశనగ పంటలో పంట కోత ప్రయోగం చేసినట్లు ఎఒ కాత్యాయిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ హరి, విహెచ్ఎ రవితేజ, ఎంపిఇఒ సుధ, బీమా ఏజెంట్ షమీర్, రైతులు పాల్గొన్నారు.

7న జాబ్‌మేళా

కళ్యాణదుర్గం రూరల్ : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఈనెల 7వతేదీన నిర్వహించనున్న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.వెంకట ప్రతాపరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ జి.చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ భారతి సెల్.. 94406 61900, 90109 65230 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

విశ్రాంత ఉద్యోగులకు సన్మానం

ఉరవకొండ : మండలంలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ ఆర్గనైజర్‌గా పని చేస్తూ పదవీ విరమణ పొందిన భగవాన్‌దాస్, ఆశా కార్యకర్త రత్నమ్మకు వైద్యాధికారి డాక్టర్ పావనిని స్థానిక సిబ్బంది మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో శేఖర్, స్వర్ణలత, స్టాఫ్ నర్సులు, ఆశాలు భగవాన్‌దాస్, రత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.


విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న సిబ్బంది

కరాటేలో శ్రీచైతన్య విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల 9వ బ్రాంచిలో 4వ తరగతి చదువుతున్న ఆర్.ప్రణతి కరాటేలో సత్తాచాటింది. వైజాగ్‌లో జరిగిన ఇంటర్నేషనల్ కరాటే ఈవెంట్‌లో ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించింది. ఈ సందర్భంగా పాఠశాలల ఎపిఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రణతి కరాటేలో ప్రతిభ కనపరిచి ప్రథమ స్థానంలో నిలవడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శాంత, డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ తిరుమలేశ్వరరెడ్డి, డీన్ గంగాధర, ప్రైమరీ ఇన్‌ఛార్జి దీప, ప్రీ-ప్రైమరీ ఇన్‌ఛార్జి బతుల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కరాటేలో సత్తా చాటిన ఆర్.ప్రణతి

స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి-డి.హీరేహాల్

మండల కేంద్రంలో వాల్మీకి మహర్షి విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరుతూ ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నాగలి రాజు ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగలి రాజు మాట్లాడుతూ ఎన్నోఏళ్ల నుంచి వాల్మీకుల కుల దైవమైన వాల్మీకి మహర్షి విగ్రహ ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉందన్నారు. అయితే అనివార్య కారణాల వల్ల విగ్రహ ప్రతిష్టకు కలిసిరావడం లేదన్నారు. ప్రస్తుతం మండలకేంద్రంలో స్థలం కేటాయిస్తే వాల్మీకి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటామని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి ఎర్రిస్వామి, వాల్మీకి నాయకులు వన్నూరుస్వామి, తొండే వెంకటేశు లు, గంటా వెంకటేశు లు, తదితరు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

రాయదుర్గం : బాల్యవివాహాలను నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆవులదట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని ఆవులదట్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'భేటీ బచావో బేటీ పడావో' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలిక విద్యను పెంచడం ద్వారా బాల్య వివాహాలు నిర్మూలించవచ్చన్నారు. అంతేగాకుండా బాలికలు చదువుకోవడం వల్ల ఆర్థిక సాధికారత సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సూపర్‌వైజర్ రామాంజనేయులు పాల్గొన్నారు.

7న చలో హైదరాబాద్

అనంతపురం కలెక్టరేట్ : ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈనెల 7న 'లక్షల డప్పులు-వేల గొంతుకలు' చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేద్దామని రాష్ట్ర కమిటీ ఛైర్మన్ బివిఆర్.దాస్ అన్నారు. మంగళవారం ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద డప్పులు వాయించి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాస్ మాట్లాడుతూ 6వ తేదిన అనంతపురం రూరల్, అర్బన్ గ్రామాలు, కాలనీల నుంచి మాదిగ కళాకారులు, ప్రజలు తప్పెట్లతో తరలివెళ్తున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

పామిడి : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం ప్రజాశక్తి రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎపి మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల కోదండరామిరెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన వైద్యులు శివశంకర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి సాకే ఓబులేసు, జనసేన నాయకులు కొట్టాల సూర్యనారాయణ, ప్రజాశక్తి విలేఖరి దేవరపల్లి గోపాల్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నార్పల విద్యుత్ శాఖ ఎఇగా నీలకంఠ



నార్పల : మండల విద్యుత్ శాఖ ఎఇగా నీలకంఠ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాకేంద్రంలోని విద్యుత్ ప్రధాన కార్యాలయంలో డి వన్‌గా విధులు నిర్వహిస్తున్న నీలకంఠను ఉద్యోగోన్నతిపై నార్పల ఎఇగా బదిలీ చేశారు. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలు, రైతులకు అందుబాటులో ఉంటూ విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

నారాయణ పాఠశాలలో సరస్వతి పూజ

అనంతపురం సిటీ : నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులో ఉన్న నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో మంగళవారం సరస్వతీ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూలు ఎజిఎం సుధాకర్‌రెడ్డి, క్లస్టర్ ప్రిన్సిపాల్ నీలిమా, ప్రిన్సిపాల్ రాధానాయుడు, వైస్ ప్రిన్సిపాళ్లు గౌసియా, పవిత్ర, వాణి, పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందించాలి

రాప్తాడు : గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ యుగంధర్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆశాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశావర్కర్లు ఆయా గ్రామాల్లోని గర్భిణుల ఇళ్లకు వెళ్లి ఐరన్ మాత్రలతోపాటు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ శివప్రసాద్, సూపర్‌వైజర్లు అరుణ, నరసింహ, ఎంఎల్‌హెచ్‌పిఎస్, ఎన్ఎంఎస్, ఆశాలు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే రోగాలు దూరం

యాడికి : పరిసరాలతోపాటు వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారానే రోగాలు దరిచేరవని తాడిపత్రి మలేరియా నివారణ అధికారి శ్రీనివాసులు సూచించారు. ఆశాడేలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలు ప్రతి ఇంటికీ వెళ్లి పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ జుబేదా, పిహెచ్ఎన్ వెంకటలక్ష్మి, పిహెచ్ఎన్ సుమతి, సూపర్‌వైజర్ షబ్బీర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

యాడికి : జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా సివిల్ సర్జన్ డాక్టర్ సైదన్న ఆదేశాల మేరకు మంగళవారం మండల పరిధిలోని తిప్పారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో 43 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఐదుగురికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. ఆపరేషన్ చేయించుకున్న వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి డివిజన్ జిపిఎంఒఒ మధుసూదనరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయరాముడు, 104 డిఇఒ అనిల్, పైలట్ బాలాజీ, ఎఎన్ఎం స్వర్ణలత, అంగన్‌వాడీ టీచర్ రాజ్యలక్ష్మి, ఆయా జైనూబీ, ఆశా కార్యకర్త పద్మావతి పాల్గొన్నారు.

'మల్టీమీడియా' అవగాహన

అనంతపురం : స్థానిక ఆలమూరు రోడ్డులోని పివికెకె ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం, కెరీర్ గైడెన్స్ సెల్ సంయుక్తంగా 'డిజిటల్ యుగంలో మల్టీమీడియా అవగాహన' అనే అంశంపై ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఇందులో భాగంగా పివికెకె ఐటి పూర్వ విద్యార్థిని హర్షిణి మల్టీమీడియా ప్రాధాన్యత, డిజిటల్ టెక్నాలజీ పెరుగుతున్న విధానం, విద్యార్థులకు అందుబాటులో ఉన్న అవకాశాలు, తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డా.పల్లె కిషోర్, ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, కెరీర్ గైడెన్స్ సెల్ కోఆర్డినేటర్ వహీదా, రాము, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేహదానం స్ఫూర్తిదాయకం

అనంతపురం : దేహదానం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మాణిక్యరావు అన్నారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అమలదిన్నె వెంకటరామ్‌ప్రసాద్ సతీమణి సుజాత ఆకస్మికంగా మృతిచెందడంతో మృతదేహాన్ని అనాటమీ విభాగానికి మంగళవారం దానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేహదానం వల్ల శరీరం మట్టిలో కలిసిపోకుండా వైద్య విద్యార్థుల జ్ఞానానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అనాటమీ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ ఎస్.ఉమామహేశ్వరరావు, అధ్యాపకులు డాక్టర్ నరేంద్రనాయక్, డాక్టర్ వాల్మీకి పద్మజ, డాక్టర్ బోనాల సహజీర్, డాక్టర్ పునర్జీవన్ కుమార్, డాక్టర్ భాను తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల తనిఖీ

శింగనమల : మండల కేంద్రంలోని ఎన్టీఆర్ భరోసా రూ.15వేల పింఛన్లపై అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఏకులనాగేపల్లి, లోలూరు, వెస్టు నరసాపురం పంచాయతీ చిన్న జలాలపురం గ్రామాల్లో వైద్యాధికారులు రెండు బృందాలుగా విడిపోయి పింఛన్‌దారులు సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తరిమెల పిహెచ్‌సి డాక్టర్ శంకర్‌నాయక్, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతిచెందిన మంజునాథ

రాయదుర్గం : పట్టణంలో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. గుమ్మగట్ట మండలం భూపసముద్రం గ్రామానికి చెందిన మంజునాథ (22), చిత్రలింగ, మంజు ద్విచక్ర వాహనంలో బళ్లారి రోడ్డులోని కుంటి మారెమ్మ ఆలయంలో మంగళవారం పూజలు చేసుకున్నారు. తిరిగి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా పట్టణంలోని రవాణా శాఖ కార్యాలయం ట్రాక్టర్ ఢీకొంది. దీంతో మంజునాథ మృతిచెందాడు. మంజు, చిత్రలింగ గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీస్ ఇన్స్‌పెక్టర్ జయనాయక్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. తర్వాత ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉలవ పంట వాములు దగ్ధం

రాయదుర్గం : మండలంలోని 74 ఉడేగోళం గ్రామం వద్ద మంగళవారం నిప్పంటుకుని ఉలవ పంటవాములు కాలిపోయాయి. గ్రామానికి చెందిన రైతు గురుసిద్ధప్ప ఉలవ పంట సాగు చేసి పంట నూర్పిడి కోసం 8 వాములుగా ఏర్పాటు చేసుకున్నాడు. ఈనేపథ్యంలో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు వాములకు నిప్పంటించడంతో కాలిపోయాయి. అగ్నిమాపక దళం ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేసింది. ఈ ఘటనలో నాలుగు పంటవాములు మంటల నుంచి రక్షించారు.

వరిగడ్డి బండికి నిప్పు

బుక్కరాయసముద్రం : వరి గడ్డి బండికి నిప్పు అంటుకుని గడ్డి దగ్ధమైన ఘటన మంగళవారం మండలంలోని ఓబుళాపురంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన శివారెడ్డి నార్పల వద్ద రూ.20వేలకు వరిగడ్డి కొని ఎద్దుల బండిలో గ్రామానికి తీసుకొస్తుండగా ఓబుళాపురం గ్రామంలో పైన కరెంటు తీగలు తగిలి అంటుకుంది. దీంతో గడ్డి బూడిదైంది. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరాడు.